సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 21 । మే । 2023



చైన్ లాగి...రైలును ఆపి

కమలాపురం సమీపంలో సాఫీగా వెళుతున్న రైలు చైన్ లాగి..కిటికీల పక్కన నిద్రిస్తున్న ముగ్గురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలు లాక్కెళ్లారు. -8లో..



మొక్కు తీరకనే..

ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు వెళుతుండగా ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో యువచైత్ర (10) అనే బాలిక మృతి చెందింది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.130
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 843 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	218	430
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 641.08 కిలోలు

న్యూస్‌రీల్

అన్నమయ్య జిల్లా జేసీగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



రాయచోటి : అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి శనివారం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజంపేట సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను బదిలీపై జిల్లా జేసీగా నియమించారు.

'స్పందన' తాత్కాలికంగా రద్దు

రాయచోటి: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 22వ తేదిన జరగబోయే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శనివారం ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ సర్వసభ్య సమావేశం పనుల్లో నిమగ్నమైన ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ, మండల, డివిజన్‌లలో యథావిధిగా స్పందన కార్యక్రమం జరగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: కడపలోని ఏపీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 3వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ పి. విజయలక్ష్మి తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బ్యాక్‌లాగ్ సీట్లకు గిరిజన బాలికలు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థినులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థినుల ఎంపిక కడపలోని జిల్లా గిరిజన సంక్షేమాధికారి కార్యాలయంలో లాటరీ విధానంలో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 94406 87844 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

వైవీయూ: వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న హైస్కూల్ ప్లస్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ)గా పనిచేసేందుకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 10 సబ్జెక్టులకు గాను 92 ఖాళీలకు గాను 75 మంది ఉపాధ్యాయులు పీజీటీలుగా పదోన్నతులు కోరుకున్నారు. మొత్తం మీద 265 దరఖాస్తులు రాగా 75 మంది పీజీటీలుగా పదోన్నతులు పొందారు. జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు స్థానాలను ఆప్ట్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు పోస్టులకు 21న..

వైవీయూ: జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మిగిలిన ఖాళీల్లో పీజీటీ రీడిప్లాయ్‌మెంట్ ద్వారా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 21న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఖాళీల వివరాలిలా ఉన్నాయి.

జెడ్పీహెచ్ఎస్ ప్లస్	సబ్జెక్టులు
గోపవరం	మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ
తాళ్లప్రొద్దుటూరు	మ్యాథ్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్, కామర్స్
ముద్దనూరు	ఫిజిక్స్
వేంపల్లి	కామర్స్
చిలంకూరు	కామర్స్
కోడూరు	సివిక్స్, ఎకనామిక్స్
రాజంపేట	మ్యాథ్స్
నాగిరెడ్డిపల్లి, నందలూరు	మ్యాథ్స్, జువాలజీ

పనులు.. పరుగులు



వేగంగా గృహనిర్మాణాలు
- రాష్ట్రంలో నాలుగో స్థానంలో అన్నమయ్యజిల్లా
- ఇప్పటిదాకా లబ్ధిదారులకు రూ.608 కోట్లు చెల్లింపు



మదనపల్లె మండలం పోతబోలు జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణాలు (ఇన్‌సెట్) కురబలకోట మండలం కంటేవారిపల్లె జగనన్నకాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా



బి.కొత్తకోట: జగనన్నకాలనీల్లో పేదలకు మంజూరు చేసిన ఇంటి నివేశస్థలాల్లో గృహ నిర్మాణాలు పరుగులు తీస్తున్నాయి. నవరత్నాలు–పేదలందరికి ఇళ్ల పథకం ద్వారా జిల్లాలో అర్హులైన పేదలను గుర్తించి స్థలాలు, ఇంటినిర్మాణాలు మంజూరు చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన 73,531 మంది లబ్ధిదారులకు 502 లేవుట్లలో గృహాలు మంజూరుచేశారు. మదనపల్లె నియోజకవర్గానికి అత్యధికంగా మంజూరయ్యాయి. గృహనిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. మదనపల్లెకు 14,191, రాయచోటికి 18,178, పీలేరుకు 11,810, తంబళ్లపల్లెకు 11,810, రాజంపేటకు 10,375, కోడూరుకు 7,137 గృహ నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టగా ఇప్పటిదాకా జిల్లాలో 21,400 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ నిర్మాణాలతో జిల్లా రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. పూర్తయిన, వివిధ స్థాయిలోని నిర్మాణాల కోసం ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.522.60 కోట్ల బిల్లులు చెల్లించగా, రూ.85.42 కోట్ల మెటీరియల్‌ను అందించింది. ఇళ్ల నిర్మాణాల కోసం మొత్తం రూ.608,03,63,055 ఖర్చు చేసింది.

గత పాలనకు భిన్నంగా..

గత ప్రభుత్వ పాలనకు పూర్తి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం సహకారం అందిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం కోసం రూ.1.50 లక్షలు చెల్లించినా అది రుణంగా తిరిగి చెల్లించాల్సి వచ్చేది. సిమెంటు మాత్రమే సరఫరా చేసేది. ప్రస్తుతం ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తోంది. ఈ సొమ్మును తిరిగి రుణంగా చెల్లించాల్సిన అవసరం లేదు. దీనికితోడు సిమెంట్, ఇనుప కమ్మీ, తలుపులు, కిటికిలు అందిస్తోంది. గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలు చూపి చేతులు దులుపుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించింది. ప్రధానంగా బిల్లుల చెల్లింపు సకాలంలో చేస్తున్నారు. పెండింగ్ మాట లేకుండా లబ్ధిదారుల ఇంటి నిర్మాణస్థాయిని బట్టి బిల్లుల నగదును వారి ఖాతాలకు జమ చేస్తోంది ప్రభుత్వ చర్యలతో నిర్మాణ పనుల వేగం అందుకున్నాయి.

కలెక్టర్ విస్తృత తనిఖీలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల నిర్మాణాలపై కలెక్టర్ గిరీషా పీఎస్ పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కలెక్టర్ స్థాయిలో తనిఖీలు, పరిశీలనలు అరుదుగా ఉండేవి. అయితే కలెక్టర్ గిరీషా జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, కల్పించిన సౌకర్యాలు, విద్యుత్, నీటి వసతులపై ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఎక్కడికక్కడ లబ్ధిదారులను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. కలెక్టర్ తనిఖీలతో గృహనిర్మాణశాఖలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారుల్లో కదలిక వచ్చింది.

ఇళ్ల నిర్మాణాల తాజా స్థితి

మంజూరు:	73,531
బీబీఎల్:	20,243
బీఎల్:	21,171
ఆర్ఎల్:	6,876
ఆర్‌సీ:	2,999
పూర్తి:	21,262
ప్రారంభం కానివి:	980

ఇళ్ల ఖర్చు వివరాలు..

నియోజకవర్గం	నగదు చెల్లింపు	మెటీరియల్ ఖర్చు
మదనపల్లె	రూ.117,06,51,688	రూ.19,15,68,712
రాయచోటి	రూ.115,42,31,084	రూ.17,97,26,328
పీలేరు	రూ.102,51,46,274	రూ.15,83,32,267
తంబళ్లపల్లె	రూ.80,96,75,153	రూ.12,19,80,093
రాజంపేట	రూ.64,97,08,669	రూ.12,02,85,837
రైల్వేకోడూరు	రూ.41,66,62,471	రూ.8,23,94,479

లక్ష్యాలు సాధిస్తున్నాం

కలెక్టర్ దిశానిర్దేశంతో ముందుకు సాగుతునానం. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతిశనివారం హౌసింగ్ డే నిర్వహిస్తూ, సమీక్షిస్తూ నిర్మాణపనుల్లో వేగం పెంచుతున్నాం.

–సాంబశివయ్య, జిల్లా గృహనిర్మాణ అధికారి

కట్టుదిట్టంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి

వైవీయూ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి కట్టుదిట్టంగా నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి పేర్కొన్నారు. శనివారం కడపలోని సెయింట్‌జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ప్రథమ సంవత్సరం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతయాని తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆర్ఐఓ రమణరాజు మాట్లాడుతూ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 16,486 మంది, ద్వితీయ సంవత్సరం 10,200 మంది, మొత్తం 26,686 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్‌లు ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ నెంబర్ 08562-244171 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ (వైఎస్సార్ జిల్లా): కడప–తిరుపతి–కడప మధ్య తిరుగుతున్న ఏపీఎస్ ఆర్టీసీ విద్యుత్ ఏసీ బస్సులు నడిపేందుకు అర్హులైన డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యూనివర్సల్ మొబిలిటీ ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు 58 సంవత్సరాలు మించరాదని, కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తయి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు, ఐదు ఫొటోలు, ఆర్టీఏ క్లియరెన్స్ సర్టిఫికెట్ లేటెస్ట్ (ఐదు సంవత్సరాలు)తో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 83410 27109, 91825 76787 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వచ్చేనెల 20 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి

పులపత్తూరులో కలెక్టర్ గిరీషా పర్యటన



గ్రామస్తులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా

రాజంపేట: వరదపీడిత గ్రామమైన పులపత్తూరులో వచ్చేనెల 20 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శనివారం పులపత్తూరు గ్రామంలో దళితుల కాలనీ నిర్మాణాల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడారాల్లో ఉన్న వారిని సొంతింటికి చేర్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. 20 మంది ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా లాంటి సదుపాయాలను కల్పించాలని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఉంటే వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించారు. గుడి నిర్మాణం స్థలం కేటాయించాలన్నారు. ఇంటిపట్టాలు ఇవ్వకుండా ఉన్నవారికి శనివారం లోగా ఇవ్వాలన్నారు.వచ్చేవారంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించాలని సబ్‌కలెక్టరు అహ్మద్‌ఖాన్‌ను ఆదేశించారు. ఈ సదస్సులో ఆన్‌లైన్ ఫీడింగ్ పరిశీలించాలన్నారు. సర్వే తర్వాత భూ విషయంలో క్లారిటీ వస్తుందన్నారు. వచ్చే వారం మళ్లీ లేఔట్‌ను సందర్శిస్తామన్నారు. సీరియస్‌గా తీసుకొని పనులు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట జాయింట్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్, గ్రామప్రతినిధి జగన్, గృహనిర్మాణశాఖ పీడీ శివయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బధిరుల మహిళా క్రికెట్ జట్టుకు నవ్య



కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడప నగర పరిధిలోని దండు గ్రామానికి చెందిన మెల్లా నవ్య సరోజిని జాతీయస్థాయి బధిరుల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఏపీ మహిళల జట్టుకు ఎంపికైంది. ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించనున్న ఐడీసీఏ ఉమన్స్ 4వ టీ-10 నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ జట్టులో ఈమె పాల్గొంటుంది. బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణిస్తున్న కడపకు చెందిన క్రీడాకారిణి ఏపీ జట్టుకు ఎంపిక కావడం పట్ల క్రికెట్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

మినీ మహానాడుకు స్పందన కరువు

- సమావేశానికి డుమ్మా కొట్టిన ఇన్‌చార్జిలు
- టీడీపీలో చర్చనీయాంశం



మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కడప రూరల్: ఈ నెల 23వ తేదీన తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు నియోజక వర్గంలోకి ప్రవేశించనుంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా టీడీపీ నేతలు శనివారం కడప రహమతీయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మినీ మహానాడుకు తమ్ముళ్ల నుంచి స్పందన కరువైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లాలో చేపట్టే లోకేష్ పాద యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కాగా ఈ కార్యక్రమానికి కీలకంగా వ్యవహరించాల్సిన ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పలువురు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి, బద్వేల్, కడప నుంచి రితేష్‌రెడ్డి, అమీర్‌బాబులు మాత్రమే పాల్గొన్నారు. సోమిరెడ్డి తన ప్రసంగంలో కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఏదో పనిపై వెళ్లారని చెప్పారు. మిగిలిన వారు ఎందుకు హాజరు కాలేదనేది ప్రశ్నార్థకంగా మారింది. కింది స్థాయి కార్యకర్తలను చైతన్యవంతం చేయాల్సిన నేతలే సమావేశానికి హాజరు కాలేకపోవడం దారుణమని తమ్ముళ్లు చర్చించుకున్నారు. మొత్తం మీద మినీ మహానాడును తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల పార్టీలోనే అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

హెచ్ఐవీ బాధితులకు అండ..

- కౌన్సెలింగ్‌తో మనోధైర్యం
- నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం



క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, స్వచ్ఛంద సంస్థలు (ఫైల్)

మదనపల్లె సిటీ: హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వ్యాధిగ్రస్తులకు ఐసీటీసీ కేంద్రాల్లో కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యం కల్పిస్తున్నారు. ప్రతి ఏడాది మే మూడోఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది బలమైన వ్యవస్థను నిర్మించడానికి హెచ్ఐవీతో జీవించే వారి పట్ల ప్రేమ, సంఘీభావం విస్తరించుదాం అనే నినాదం ఇచ్చారు. వ్యాధితో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పిస్తారు.

- హెచ్ఐవి/ఎయిడ్స్‌తో బాధపతుడున్న వారికి ఏఆర్‌టీ (యాంటీ రిట్రోవైరల్) కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఆత్మస్థైర్యాన్ని నింపేలా కౌన్సెలింగ్‌ను ఇవ్వడంతో పాటు అవసరమైన మందులను అందిస్తున్నారు. జిల్లాలో మదనపల్లెలో ఏఆర్‌టీ కేంద్రం ఉంది. దీంతో పాటు రాయచోటి, పీలేరు ఏఆర్‌టీ ప్లస్,తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, రాజంపేట, లక్కిరెడ్డిరెడ్డి, రైల్వేకోడూరులలోని ప్రభుత్వ సీహెచ్‌సిలలో లింక్ ఏఆర్‌టీ కేంద్రాలున్నాయి. ఆయా ఐసీటీసీ కేంద్రాల్లో నిర్వహించే రక్తపరీక్షల్లో హెచ్‌వీ పాజిటివ్ ఉందని తెలితే వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నేషనల్ ఎయిడ్స్ ఆర్గనైజేషన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో వ్యాధిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్ఐవీ వచ్చాక బాధపడేకన్నా దాని బారిన పడకుండా చూసుకోవాలని పలు కార్యక్రమాలతో చైతన్యం పెంచుతున్నారు. ముందు జాగ్రత్తే అసలైన మందు అనే విషయాన్ని వివరిస్తున్నారు. గతంతో పోలిస్తే బాధితులకు మందులు సకాలంలో అందిస్తుండటంతో ఆరోగ్యం మెరుగవుతోంది. ఏటా పరీక్షల సంఖ్యను పెంచుతూ పాజిటివ్ కేసులను గుర్తిస్తున్నారు.హెచ్‌వీ పాజిటివ్ గల గర్భిణికి ముందుగా పీపీటీసీటీ చికిత్స అందిస్తూ పుట్టబోయే బిడ్డను ఎయిడ్స్ నుంచి కాపాడే ప్రయత్నాలు జిల్లాలో జరుగుతున్నాయి.ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటోంది. వారికి ఫించన్‌తో పాటు పలు సంస్థల సహకారంతో పోషకాహారం అందిస్తున్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

ఐసీటీసీ కేంద్రాలు: మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, బి.కొత్తకోట,తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు

ఏఆర్‌టీ కేంద్రం: మదనపల్లె

ఏఆర్‌టీలో నమోదైన హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు: 4,470 మంది



తంబళ్లపల్లెలోని ఐసీటీసీ కేంద్రం

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కళాబృందాలతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాధితులకు మనోధైర్యం కల్పిస్తున్నాం. –డాక్టర్ శైలజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, రాయచోటి

క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయులు సస్పెన్షన్

రాయచోటి టౌన్ : నాడు – నేడు పాఠశాల భవనాల నిర్మాణాల పనులలో అలసత్వం వహించిన ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులను విధుల నుంచి తొలిగించినట్లు ఆయన స్పష్టం చేశారు. విధుల నుంచి తొలిగించిన వారిలో చిట్వేల్ మండలం హనుంపల్లె ప్రధానోపాధ్యాయులు ఏ. మహబూబ్ బాష, వీరబల్లె మండలం వంగిమళ్ల షేక్ . ఖాదర్ బాష, లక్కిరెడ్డిపల్లె మండలం తాటిమాకుల పల్లె ప్రధానోపాధ్యాయురాలు డి. లక్ష్మి శెట్టి, కలకడ మండలం నడిమిచెర్ల ప్రధానోపాధ్యాయుడు ఏ. శంకరయ్యలు ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీరిని విధుల నుంచి తొలిగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

బండరాయితో వ్యక్తిపై దాడి

మదనపల్లె : బండరాయితో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మండలంలోని తుంగావారిపల్లెకు చెందిన గణేష్ (30) బండ కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. మదనపల్లె సమీపంలోని చేనేత నగర్ వద్ద ఉన్న బండ మీద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో చింతయ్యగారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి బండ కొడుతున్న స్థలం తనదేనని గణేష్‌తో గొడవ పెట్టుకున్నారు. వాగ్వివాదం పెరిగి ఆవేశానికి లోనైన కృష్ణమూర్తి బండరాయితో గణేష్‌పై దాడి చేశారు. దాడిలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ లాగి.. రైలును ఆపి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే డీఎస్పీ షేక్ షాను



డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, పోలీసులు

- మహిళల మెడల్లోని మూడు బంగారు గొలుసుల చోరీ
- కమలాపురం–ఎర్రగుంట్ల మధ్యలో దొంగతనం
- తిరుపతి–గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో ఘటన

కడప కోటిరెడ్డిసర్కిల్/ కమలాపురం : సాఫీగా వెళుతున్న రైలు చైన్ లాగి.. కిటికీల పక్కన నిద్రిస్తున్న ముగ్గురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన సంఘటన కమలాపురం సమీపంలో చోటుచేసుకుంది. తిరుపతి నుంచి గుంటూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు (17262) శుక్రవారం అర్ధరాత్రి 11.27 గంటలకు కమలాపురం చేరుకుంది. 11.28 గంటలకు బయలుదేరిన రైలును నాలుగు కిలోమీటర్లు వెళ్లగానే రైలులో కాపుకాచిన దొంగల్లో ఒకడు చైన్‌ను లాగాడు. దీంతో రైలు 286/16 కిలోమీటరు నెంబరు వద్ద ఆగిపోయింది. స్లీపర్ బోగీల వద్దకు వచ్చిన దొంగలు కిటికీల పక్కన పడుకున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు ప్రతిఘటించగా, నిద్రిస్తున్న ముగ్గురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లారు. అర్ధరాత్రి కావడం...చల్లని గాలి కోసం కిటికీలను తెరిచి ఉంచడంతో దొంగలు కిందినుంచే సులువుగా చోరీ చేయగలిగారు. బయట చీకటిగా ఉండడంతో పారిపోతున్న దొంగలను ప్రయాణీకులు కనీసం ఫోటోలు కూడా తీయలేకపోయారు. తోటి ప్రయాణీకులు వెంటనే విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు చేరవేశారు. పది నిమిషాల తర్వాత అక్కడి నుంచి బయలుదేరిన రైలు 12.04 గంటలకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కూడా రెండు నిమిషాలు మాత్రమే ఆగిన రైలు 12.06 గంటలకు ఎర్రగుంట్లలో బయలుదేరి తర్వాత గుంటూరుకు వెళ్లిపోయింది.

ఘటనా స్థలం పరిశీలన..

తిరుపతి నుంచి గుంటూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన దొంగతనం ఘటనా స్థలాన్ని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, రైల్వే డీఎస్పీ షేక్ షాను శనివారం పరిశీలించారు. కమలాపురం–ఎర్రగుడిపాడు రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న సి.గోపులాపురం గ్రామ సమీపంలో ఘటన జరిగినట్లు టీటీ ద్వారా తెలుసుకున్న వారు అక్కడికి చేరుకున్నారు. కడప డీఎస్పీ షరీఫ్, కమలాపురం, ఎర్రగుంట్ల సీఐలు సత్యబాబు, మంజునాథ రెడ్డి, వారి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌తో దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

54 గ్రాములు బంగారు చోరీ

తిరుపతి–గుంటూరు ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళల నుంచి 54 గ్రాముల బంగారు నగలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు అందినట్లు రైల్వే డీఎస్పీ షేక్ షాను తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 6 నుంచి 10 మంది దుండగులు ఉండవచ్చని ఎస్–1, ఎస్–5, ఎస్–6 కోచ్‌లలో ముగ్గురు మహిళలపై దాడి చేసి 54 గ్రాముల బంగారు చైన్లు స్నాచింగ్ చేశారన్నారు. ప్రతిఘటించిన సుబ్బారెడ్డి అనే ప్రయాణికుడికి చిన్న గాయం అయిందన్నారు. ఈ ఘటన జరిగిన తక్షణం టీటీ ద్వారా తెలుసుకున్న తాము దుండగులు పారిపోవడానికి వీలున్న రాయచోటి, మైదుకూరు, తిరుపతి, ప్రొద్దుటూరు రూట్లలో ఉన్న హైవే పెట్రోలింగ్ వాహనాలతో పాటు స్థానిక సర్కిల్ పరిధిలోని రక్షక వాహనాలను, బీట్ పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. ఇప్పటికే డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్నామని, త్వరలోనే దుండగులను పట్టుకుంటామని ఆమె వివరించారు. రైల్వే సీఐ నాగార్జున, ఎస్ఐ రారాజు ఆమె వెంట ఉన్నారు.

మొక్కు తీరకనే..

- ఆటోను ఢీకొన్న కారు
- బాలిక మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో నుజ్జునుజ్జు అయిన ఆటో, చెల్లాచెదురుగా పడిన క్షతగాత్రులు



ప్రమాదంలో మృతిచెందిన యువచైత్ర

పీలేరు రూరల్ : ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందగా, ఐదు మందికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రెడ్డివారిపల్లె బస్టాప్ వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. తిరుపతికి చెందిన ఆంజినేయులు తన ఆటోలో తన కుటుంబ సభ్యులు భార్య జ్యోతి, తల్లి రామలక్షుమమ్మ, పిల్లలు యువచైత్ర (10), సాత్విక, అక్క కుమార్తె జ్ఞానశ్రీతో శనివారం తిరుపతి నుంచి కలకడ మండలం గుడిబండలో ఓ ఆలయంలో మొక్కులు తీర్చుకోవడానికి బయలుదేరారు. అయితే మార్గం మధ్యలోని రెడ్డివారిపల్లె బస్టాప్ వద్ద కడప నుంచి పీలేరు వస్తున్న కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో యువచైత్ర అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ఐదు మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

ఆర్టీసీ బస్సు – ఆటో ఢీ



ఆటో – ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రదేశంలో గుమికూడిన స్థానికులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : మామిడి కాయల లోడుతో వస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న రామమోహన్‌తో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... వీరబల్లె మండలం ఓదివీడు గ్రామానికి సమీపంలో కావలిపల్లెకు చెందిన ఓ మామిడి రైతుకు చెందిన మామిడి కాయలు కోసుకొని ఆటోలో లోడు చేసుకొని రాయచోటికి వెళుతుండగా.. అదే సమయానికి రాయచోటి డిపోకు చెందిన బస్సు రాయచోటి నుంచి రాజంపేటకు వెళుతోంది. ఓదివీడు సమీపాన శిబ్యాల వంక బిడ్జి వద్దకు రాగానే ఎదురుగా మామిడి కాయల లోడుతో వస్తున్న ఆటోను బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వీరబల్లె పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఢీ కొన్న బస్సు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి గువ్వలచెరువు సమీపంలోని కొత్తరోడ్డు నారాయణపురం వద్ద గల పోలీస్‌చెక్‌పోస్టును శనివారం ఉదయం కడప వైపు నుండి రాయచోటి వైపు వెళ్తున్న వీఆర్‌సీఆర్ బస్సు ఢీ కొంది. దీంతో బస్సు ముందు భాగం కొంతమేర దెబ్బతింది. చెక్‌పోస్టు పాక్షికంగా దెబ్బతింది. బస్సును మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంకు మేనేజరుపై కేసు

బి.కొత్తకోట : వన్‌టైం సెటిల్‌మెంట్ పేరుతో రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము బ్యాంకుకు జమ చేయని మేనేజరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ శనివారం తెలిపారు. బి.కొత్తకోట ఇండియన్ బ్యాంకు మేనేజర్‌గా జయరాములు నాయక్ గతంలో పని చేశారు. అప్పట్లో వన్‌టైం సెటిల్మెంట్ ఉందని చెప్పడంతో రైతులు ఓటీఎస్ ద్వారా రుణాలు చెల్లించారు. అయితే మేనేజరు జయరాములు తక్కువ మొత్తం బ్యాంకుకు జమ చేశాడు. సుమారు రూ.50 లక్షలు వసూలు చేయగా అందులో బ్యాంకు అధికారులు అతని నుంచి రికవరీ చేశారు. ఇంకా కొంతమొత్తం జమకాలేదు. ఇందులో రూ.8.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీనిపై ప్రస్తుతం మేనేజర్ హరినాథగుప్తా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెన్షన్‌లో ఉన్న జయరాములుపై కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

పాముకాటుతో ఇద్దరికి తీవ్ర అస్వస్థత

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరువ్యక్తులు పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థత పాలయ్యారు. వివరాలు.. మదనపల్లె పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన రఘుపతి భార్య మైథిలి (26) శనివారం ఇంటిలో నిద్రిస్తుండగా పాముకాటుకు గురైంది. అదే విధంగా పీటీయం మండలం అంకిరెడ్డిపల్లెకు చెందిన నగేష్ (30) పొలం వద్ద పనులు చేస్తుండగా విషసర్పం కాటేసింది. ఆయా ఘటనల్లో బాధితులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్‌సీకి తీవ్రగాయాలు

మదనపల్లె : ఆటో ఢీకొన్న ప్రమాదంలో మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రమేష్ (50) తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ రమేష్ సిబ్బందితో కలిసి వాహన ప్రమాదాల నివారణలో భాగంగా రేడియం స్టిక్కర్లు అంటిస్తుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హెడ్‌కానిస్టేబుల్‌ను అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్య చికిత్సకు తిరుపతికి రెఫర్ చేశారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

కర్ణాటక వాసి మృతదేహం మున్సిపాలిటీకి అప్పగింత

మదనపల్లె : ఇటీవల మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ అడవిలోపల్లె సమీపంలోని నడిమిచెరువులో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన కర్ణాటక వాసి శంకరప్ప మృతదేహాన్ని తాలుకా పోలీసులు శనివారం మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. రెండు రోజుల క్రితం మృతదేహాన్ని వెలికితీసి జిల్లా ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. బాధితుని కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు మున్సిపల్ సిబ్బందితో కలిసి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్ఈబీ విస్తృత దాడులు

మదనపల్లె : మదనపల్లె మండలంలో ఎస్ఈబీ అధికారులు శనివారం విస్తృత దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి, ద్విచక్రవాహనంతోపాటూ 240 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఐదువేల లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి, సారా తయారీకి నల్లబెల్లం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని కొండమీదచెరువు తాండా సమీపంలో సెబ్ అధికారుల బృందం విస్తృతంగా దాడులు జరిపిందన్నారు. మదనపల్లె పట్టణం నక్కలదిన్నెతాండాకు చెందిన సుగాలిబాబునాయక్ (26) నాటుసారా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన షేక్ జబీర్ (32) సారా రవాణా చేస్తుండగా ద్విచక్రవాహనంతోపాటూ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 140 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో కేఎంసీతాండాలో మరిన్నిదాడులు చేసి సదరు ప్రాంతంలో ఐదువేల లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి వందలీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ సి.రాజశేఖర్, ఎస్ఈబీ సిబ్బంది చంద్రశేఖర్, త్రిపురేంద్రుడు, మునిరామయ్య, హరికుమార్, దామోదర్, ప్రసన్నకుమార్, లవకుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. వాల్మీకిపురం మండలం పునుగుపల్లెకు చెందిన హరికృష్ణ భార్య చందన (25) భర్త ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వస్తుండటంతో, మనస్తాపంతో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే విధంగా బి.కొత్తకోట మండలం గోళ్లపల్లెకు చెందిన శంకర భార్య నేత్ర (35) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే విధంగా మదనపల్లె పట్టణంలోని దేవళంవీధికి చెందిన బాలకృష్ణ భార్య కవిత (23)ను కొద్ది రోజులుగా సత్యసాయి జిల్లా కదిరికి చెందిన వినోద్ కుమార్ వేధిస్తున్నాడు. అతని వేధింపులు భరించలేక మనస్తాపం చెంది శనివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితుల్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

■ భార్య తన మాట వినడం లేదని ఓ వ్యక్తి కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని తట్టివారిపల్లెకు చెందిన యాదగిరి (40) తన భార్య యాదమ్మ చెప్పిన మాట వినడం లేదని మనస్తాపం చెందాడు. తాను నివసిస్తున్న ఇంటిలోనే కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితున్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎన్నుకొని ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డా.విభీషణశర్మ

రాజంపేట : విద్యార్థులు ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఎన్నుకొని ముందుకెళ్లాలని తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డా.ఎ.విభీషణశర్మ అన్నారు. శనివారం ఏఐటీఎస్ వార్షికోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆదర్శభావాలతో ముందుకుసాగాలన్నారు. ఉన్నతశిఖరాలు అధిరోహించాలంటే క్రమశిక్షణ, పట్టుదల ఎంతైనా అవసరమన్నారు. అన్నమయ్య నడిచిన నేలలో ఏఐటీఎస్ విద్యాసంస్థ ఉండటం ఇక్కడి ప్రాంతీయులకు ఎంతో గౌరవమన్నారు. రాజంపేట డీఎస్పీ వీఎస్‌కే చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదవాలన్నారు. ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలన్న తన అభిమతం నెరవేరిందన్నారు. అన్నమయ్య యూనివర్సిటీ ఏర్పాటుకు కృషిచేస్తున్నామని, ప్రభుత్వం సహకారం కూడా ఉందన్నారు. ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణుడు డా.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లో వెళుతూ కిందపడిన యువతి



బైక్‌లో నుంచి కిందపడిపోయిన యువతి హరిణి

సిద్దవటం : కడప నగరానికి చెందిన హరీష్ తన చెల్లెలు హరిణితో కలిసి భాకరాపేట వైపునుంచి కడపకు బైకులో వెళుతుండగా జెఎంజె కళాశాల వద్ద హరిణి కిందపడిపోయింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం సాటిలైట్ సిటీకి చెందిన హరీష్ తన చెల్లెలును బైకులో వెనుకవైపు కూర్చోబెట్టుకొని శనివారం సాయంత్రం సిద్దవటం మండలం భాకరాపేట వైపు నుంచి కడపకు ప్రయాణించారు. బైక్ సిద్దవటం మండల శివారులో ఉన్న జెఎంజె కళాశాల వద్దకు వెళ్లగానే ఉన్నట్లుండి హరిణి బైక్‌పైనుంచి కిందపడిపోయింది. చెక్‌పోస్టు వద్ద ఉన్న అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన వెళ్లి కిందపడ్డ యువతిని నీరు తాపేందుకు పైకి లేపే ప్రయత్నం చేయగా ఆమె మళ్లీ కింద పడిపోయింది. సకాలంలో 108 వాహనం అందుబాటులో ఉండటంతో అపస్మారక స్థితిలో ఉన్న యువతిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి అటవీ సిబ్బంది తరలించారు.

ఈతకెళ్లి మృత్యువాత



ప్రమాదవశాత్తు నీటిమడుగులో పడి మృతి చెందిన సల్మా

రాయచోటి టౌన్ : సరదాగా తల్లితో కలసి ఈతకెళ్లిన ఓ చిన్నారి నీటి మడుగులో పడి మృత్యువాత పడింది. బాధితురాలు రాయుడు కాలనీకి చెందిన యాస్మిన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాస్మిన్.. షేక్ సల్మా, ఆసిక్ తో అనే తన ఇద్దరి పిల్లలతో కలసి రాయచోటి పట్టణ ఎగువ భాగాన ఉన్న కంచాలమ్మ గండిలో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతూ ఉన్న సమయంలో సల్మా (16) నీటి మడుగులోకి వెళ్లడం అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక మునిగిపోతూ కేకలు వేసింది. కానీ ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో తన కుమార్తెను కాపాడేందుకు ఎవరూ లేకపోవడంతో రాయచోటి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి నీటి మడుగులో మునిగిపోయి మృత్యువాత పడిన సల్మా మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.